క్లుప్తంగా

గోసాల అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ్



పెనమలూరు: మండలంలోని గోసాల గ్రామంలో అంగన్‌వాడీ–3 కేంద్రంలో పోషణ పక్వాడ్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని సెక్టార్ సూపర్‌వైజర్ టి.రమానాగమణి గురువారం తెలిపారు. గురువారం నుంచి వచ్చే నెల నాలుగో తేదీ వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందని పేర్కొన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం, ఆకుకూరలు, చిరు ధాన్యాల వలన కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తామన్నారు. పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, బాలింతలు, గర్భిణులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ



కేసరపల్లి(గన్నవరం): మండలంలోని కేసరపల్లి శివారు చెంచులకాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ఎంపీపీ అనగాని రవి తనిఖీ చేశారు. కేంద్రం రికార్డులు, పిల్లల హాజరు, పౌష్టికాహారం నిల్వలను పరిశీలించారు. అనంతరం చిన్నారులు, గర్భిణులకు పంపిణీకి సిద్ధం చేసిన ఆహార నాణ్యతను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ చిన్నారులు, గర్భిణీలు, బాలింతల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం మంచి పోషక విలువలు కలిగిన ఆహారం అందజేస్తుందన్నారు. వీటిని అర్హులైన ప్రతిఒక్కరికీ పంపిణీ జరిగే విధంగా అంగన్‌వాడీలు దృష్టి సారించాలని సూచించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పరిశుభ్రతను పాటించాలని సూచించారు. చిన్నారులకు ఆటపాటలతో కూడిన విద్యను అందించాలన్నారు.

26న సహస్ర నామ కుంకుమార్చన

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో శోభకృత్ నామ సంవత్సర చైత్ర శుద్ధమి పంచమి వసంత నవరాత్రుల సందర్భంగా ఈ నెల 26న ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి పి. లోకేశ్వరి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఉదయం 9 గంటలకు మహాలక్ష్మి అమ్మవారికి సహస్రనామ కుంకుమార్చన, అష్టోత్తర శతకళార్చన అభిషేకం, మహాలక్ష్మి యాగం నిర్వహిస్తామని తెలిపారు. 108 కలశముల మంత్రజలముతో 108 మంది దంపతులతో అభిషేకాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. పూజలో పాల్గొనదలచిన భక్తులు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని సూచించారు.

8 మంది జూదరుల అరెస్టు

పెనమలూరు: పేకాడుతున్న ఎనిమిది మంది పేకాటరాయుళ్లను పోలీసులు గురువారం అరెస్టు చేశారు. పెనమలూరు పోలీసుల కథనం మేరకు.. యనమలకుదురు గ్రామ పరిధిలో కృష్ణానది వద్ద కొందరు పేకాడుతున్నారన్న సమాచారం పోలీసులకు అందింది. దీంతో ఆ ప్రాంతంపై పోలీసులు దాడి చేసి పేకాడుతున్న ఎనిమిది మందిని అరెస్టుచేశారు. వారి వద్ద రూ.28,160 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ధ్యాన సాధనతో సంపూర్ణ ఆరోగ్యం

గన్నవరం రూరల్: ధ్యాన సాధన వల్ల సంపూర్ణ ఆరోగ్యం, మానసిక ప్రశాంతత లభిస్తాయని సీనియర్ పిరమిడ్ మాస్టర్ ఎం.నాగ రమాదేవి చెప్పారు. ముస్తాబాద కొండపై ఉన్న శ్రీ భ్రమరాంబ సమేత రామలింగేశ్వరస్వామి గుహాలయం ఆవరణలో గురువారం విజయవాడ పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ఆధ్వర్యంలో ఏడు రోజుల పాటు జరిగే ఉచిత ధ్యాన శిక్షణ, జ్ఞాన బోధ కార్యక్రమం ప్రారంభమైంది. అభ్యాసకులను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ ధ్యానం వల్ల మానసిక ఒత్తిడి తగ్గి ప్రశాంతత లభిస్తుందన్నారు. ఆత్మవిశ్వాసం, ధైర్యం పెరిగి కష్ట సుఖాలను సమబుద్ధితో స్వీకరించే ఉన్నత వ్యక్తిత్వం లభిస్తుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ధ్యానం చేయాలని సూచించారు. శ్వాస మీద ధ్యాస నిలుపుతూ ధ్యానం చేసే పద్ధతిని నేర్పించారు. ఆలయ నిర్వహణ కమిటీ అభ్యాసకుల ఏర్పాట్లు పర్యవేక్షించింది.

నేడు మహిళలకు పోటీలు

గన్నవరం: మండల కేంద్రమైన గన్నవరంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో కృష్ణా జిల్లా క్రీడా ప్రాధికారిక సంస్థ ఆధ్వర్యంలో మహిళలకు శుక్రవారం పోటీలు నిర్వహించనున్నట్లు ప్రధానోపాధ్యాయిని ఎస్. రవీంద్ర భవాని గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మహిళలకు మండల స్థాయిలో ముగ్గులు, మ్యూజికల్ చైర్స్, పాటల పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు ఈ పోటీల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.



పచ్చి పసుపు కొమ్ములను శుభ్రం చేస్తున్న మహిళలు



దావులూరులో పసుపు కొమ్ములను వండుతున్న కూలీలు



వంట పూర్తయ్యాక బాండీని బయటకు తీస్తున్న కూలీలు

ముమ్మరంగా పసుపు వంటకాలు

పసుపు వంట పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్‌లో ఉమ్మడి కృష్ణాజిల్లాలో 2600 హెక్టార్లలో పసుపు సాగు చేపట్టారు. ఫిబ్రవరి ఆఖరు నుంచి పసుపు ఆకుతీత, దుంప తీత పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. కల్లాల్లో పసుపు రాశులు పోసి ఉంచారు. దుంపతీత పనులు పూర్తి కావటంతో దుంపలను ఉడికించి ఎండబెట్టిన పసుపు కొమ్ములను మార్కెట్‌కు తరలించేందుకు రైతులు సన్నాహాలు చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా కంకిపాడు, పెనమలూరు, తోట్లవల్లూరు, మోపిదేవి, దివిసీమ లంక గ్రామాల్లో ప్రస్తుతం పసుపు దుంప వంట పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు.

– కంకిపాడు



ఉడికిన పసుపు కొమ్ములను ఆరబెడుతున్న కూలీలు

నాడు-నేడుతో బడుల్లో సకల వసతులు



గన్నవరం రూరల్: నాడు-నేడు పథకం ద్వారా ప్రభుత్వ బడుల రూపురేఖలను అన్ని వసతులతో తీర్చిదిద్దిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి చెందుతుందని మైక్రోసాఫ్ట్ మాజీ సీనియర్ డైరెక్టర్, సైన్స్ అండ్ టెక్నాలజీ పాలసీ అడ్వైజర్ ఎస్.విద్య ప్రశంసించారు. మండలంలోని గొల్లనపల్లి జెడ్పీ హైస్కూల్‌ను సీమ్యాట్ లెక్చరర్ డాక్టర్ రావి అరుణ, సమగ్ర శిక్షా కృష్ణా ఏఎస్‌వో డి.నగేష్‌తో కలసి గురువారం ఆమె సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులు నిర్వహిస్తున్న కిచెన్ గార్డెన్‌ను, 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌ల వినియోగాన్ని పరిశీలించి విద్యార్థుల అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దార్శనికతను కొనియాడారు. పాఠశాల నిర్వహణ తీరు ఎంతో బాగుందని హెచ్‌ఎం కెఎస్ జగదీశ్వరరావును మెచ్చుకున్నారు. ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యం కోసం నూతనంగా ప్రవేశపెట్టి అందజేస్తున్న జగనన్న గోరుముద్దలో రాగిజావను విద్యార్థులకు పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు రమేష్‌బాబు, సీతామహాలక్ష్మి, సీఆర్‌పీ కాండ్రు మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

కోరట బావి నీరు అమృతమే..!

- ముస్తాబాదలో వందల ఏళ్ల నుంచి ఉన్న బావి
- శిథిలావస్థలోకి చేరినా అదే జల నీటిని చేతి పంపు ద్వారా తాగుతున్న ప్రజలు
- ఈ నీరు తాగితే జబ్బులు రావని ప్రజల్లో నమ్మకం

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద కొండ వద్ద కోరట బావి నీరు అతి శ్రేష్ఠమని స్థానికులు భావిస్తారు. వందల సంవత్సరాల నుంచి ప్రజలు ఈ బావి నీటిని తాగుతున్నారు. ఆ నీరు అమృతంతో సమానమని చెబుతారు. బొగ్గు రైలు ఇంజన్‌లు కాలం నుంచి ఈనాటి వరకూ ఆ నీటిని వినియోగిస్తూనే ఉన్నారు. గ్రామంలోని కొందరు వృద్ధులు తెలిపిన వివరాల ప్రకారం... కోరట బావి పుట్టుక నేటి తరానికి తెలియదు. తెలిసిందల్లా తమకు ఊహ వచ్చేటప్పటికీ ఆ బావి ఉందని మాత్రమే చెప్పగలరు. పూర్వులు చేదలతో (బావిపై అడ్డంగా వేసిన దుంగలపైన చేతి తాడులతో) నీరు తోడుకునే వారమని చెప్పేవారంటున్నారు. ఇప్పటి పెద్దలు సైతం ఆ విధంగా కోరట బావి నుంచి మంచినీటిని తెచ్చిన వారే. ఈ బావి నీరు మద్రాసు, విశాఖపట్టణం, రాజమండ్రి వంటి దూర ప్రాంతాలకు సైతం ఆరోజుల్లోనే రైళ్లలో గంగాళాలతో తీసుకెళ్లేవారని చెబుతున్నారు. గ్రామాల్లో ఉండే పెద్ద పెద్ద రైతులు కావిడులుతో ఈ నీటిని నిత్యం తీసుకెళ్లేవారు. ముస్తాబాద ప్రాంతంలోని మాదలవారిగూడెం, అడవినెక్కలం, సూరంపల్లి, నున్న, మంగళాపురం, పాతపాడు, అంబాపురం, గొల్లనపల్లి, బీబీగూడెం, గోపవరపుగూడెం, పురుషోత్తపట్నం, సావరగూడెం గ్రామాల నుంచి సైతం ప్రజలు వచ్చి ఈ బావి నుంచి మంచినీటిని తీసుకెళ్లినట్లు తెలిపారు. ఎడ్ల బండ్లపై గంగాళాలు ఏర్పాటు చేసి నీటిని తరలించే వారని చెబుతున్నారు.



శిథిలావస్థలో ఉన్న కోరట బావి



కోరట బావి సమీపంలోని చేతిపంపు నుంచి తాగునీరు తీసుకెళ్తున్న వివిధ గ్రామాల ప్రజలు

రోగాలు సైతం తగ్గుముఖం

కోరట బావి నీరంటే కొబ్బరి నీటితో సమానమని నమ్మేవారు. జబ్బులు రావని, దీర్ఘకాల రోగాలు నయం అవుతాయని ప్రజల్లో విశేషంగా నమ్మకం ఉండేది. వేడి గుణం ఉన్నవారు ఒక్క రోజు ఈ నీటిని తాగితే రెండవ రోజుకు వేడి తగ్గిపోయేదని ఇప్పటికీ చెబుతున్నారు. ఏడు దశాబ్దాల క్రితం ఈ బావి సమీపంలో సత్రం ఉండేది. రాష్ట్రం, జిల్లాలోని ప్రాంతాల నుంచి రోగాల బారిన పడిన వారు ఇక్కడకు వచ్చి సత్రంలో రెండు నెలలపాటు ఉండి ఈ నీటిని తాగి రోగాలను నయం చేసుకుని వెళ్లేవారని ఇప్పటికీ చెప్పుకుంటారు. 1965లో ఈ బావికి చుట్టూ కట్టడం కట్టి రక్షణ ఏర్పాటు చేశారు. గన్నవరం పూర్వపు సమితి అధ్యక్షుడు డాక్టర్ సీఎల్ రాయుడు ఆ బావికి రక్షణ గోడ కట్టించినట్లుగా శిలాఫలకం ఉంది. కాలక్రమంలో కోరట బావి శిథిలావస్థకు చేరటంతో ఆ పరిసరాల్లో గ్రామస్తులు చేతిపంపును ఏర్పాటు చేశారు. దాని నుంచి వచ్చే తాగునీరు సైతం కోరట బావి జలగా భావించి, అప్పటి నుంచి ఈరోజు వరకూ రోజూ వందలాది మంది ఇక్కడి నుంచి నీటిని ప్లాస్టిక్ క్యాన్‌లలో సుదూర ప్రాంతాల నుంచి వచ్చి తీసుకెళతారు.

ఆ నీరు తాగితే జబ్బులు రావు



కోరట బావి నీటిని తాగితే జబ్బులు రావని పెద్దలు చెప్పేవారు. ఆనాటి నుంచి ఈనాటి వరకూ ఆ నీటిని వినియోగిస్తున్నాం. బావి శిథిలావస్థలో ఉన్నా చేతిపంపు ద్వారా ఆ జలాలనే ఇప్పటికీ చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, ముస్తాబాద గ్రామస్తులు వినియోగిస్తున్నారు.

– మేడేపల్లి బాబూరావు, ముస్తాబాద మాజీ సర్పంచ్

మినరల్ నీటి కంటే శ్రేష్ఠం



కోరట బావి నీరు ఎంతో తీయగా ఉంటుంది. మినరల్ వాటర్ కంటే శ్రేష్ఠమైన నీరు ఇది. తెల్లవారుజాము నుంచి రాత్రి వేళ వరకూ గ్రామస్తులతో పాటు అన్ని గ్రామాల ప్రజలు తాగునీటి కోసం వస్తూ ఉంటారు. ఈ నీరు తాగితే జబ్బులు రావు.

–షేక్ బాజీ, ముస్తాబాద, మెకానిక్

ఇళ్ల నిర్మాణానికి రుణాలు మంజూరు

డీఆర్డీఏ పీడీ ప్రసాదరావు

పెనమలూరు: తాడిగడప మునిసిపాటీ పరిధిలో జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకునేందుకు రుణాలు మంజూరు చేస్తామని డీఆర్డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ కె.ప్రసాదరావు తెలిపారు. ఆయన గురువారం పోరంకిలోని మునిసిపల్ కార్యాలయంలో సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. మునిసిపాలిటీ పరిధిలోని పోరంకి, యనమలకుదురు, తాడిగడప, కానూరులో 5,915 మందికి ఆరు లేఅవుట్ల(జగనన్న కాలనీలు)లో ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి, పక్కా గృహాలను మంజూరు చేశామన్నారు. ఒక్కొక్క ఇంటికి రాష్ట్ర ప్రభుత్వం రూ.1.80 లక్షల ఆర్థిక సాయం అందిస్తోందన్నారు. డ్వాక్రా సంఘాల్లో ఉన్న లబ్ధిదారులకు రూ.35 వేల చొప్పున బ్యాంక్‌ల నుంచి రుణం ఇప్పిస్తామన్నారు. ఏపీఎంతో సమన్వయం చేసుకుని లబ్ధిదారులకు రుణాలు ఇప్పించాలని వెల్ఫేర్ అసిస్టెంట్లకు సూచించారు. డ్వాక్రా సంఘాల్లో లేనివారికి గృహలక్ష్మి పథకం కింద బ్యాంకు రుణం రూ.లక్ష ఇస్తామన్నారు. ఈ రుణాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించి, గృహాల నిర్మాణం వేగవంతం చేయాలని సూచించారు. ఈ సమావేశంలో మునిసిపల్ కమిషనర్ డాక్టర్ ఎస్.ప్రకాశరావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. పెనమలూరు మండల పరిషత్ కార్యాలయంలోనూ డీఆర్డీఏ పీడీ సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు 1,440 మందికి గృహాల నిర్మాణానికి రుణాలు ఇచ్చామని, మరో 1,040 మందికి రుణాలు ఇవ్వాల్సి ఉందని పేర్కొన్నారు. వారికి కూడా త్వరితగతిన రుణాలు ఇప్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సునితాశర్మ, ఏఓ లోయ శివశంకర్, వెలుగు, మండల పరిషత్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పోరంకిలో మాట్లాడుతున్న డీఆర్డీఏ పీడీ ప్రసాదరావు

డ్రోన్‌లపై పరిశోధనకు ఇజ్రాయెల్ కంపెనీ సహకారం



సమావేశంలో మాట్లాడుతున్న ఇజ్రాయెల్ డ్రోనెక్స్ ప్రతినిధులు

పెనమలూరు: డ్రోన్లపై విద్యార్థులు పరిశోధనలు చేయడానికి, డ్రోన్ టెక్నాలజీపై శిక్షణ పొందడానికి తమ కంపెనీ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందని ఇజ్రాయెల్ దేశానికి చెందిన డ్రోనెక్స్ సంస్థ చైర్మన్ రాన్‌ఎడుట్ ప్రకటించారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో గురువారం జరిగిన డ్రోన్ శిక్షణ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. దేశ విదేశాల్లో విస్తరిస్తున్న డ్రోన్ టెక్నాలజీపై విద్యార్థులు దృష్టి పెట్టాలని సూచించారు. తమ సంస్థ ద్వారా పరిశోధనలు, శిక్షణ, టెక్నాలజీ, ఇంటర్న్‌షిప్ అందిస్తామన్నారు. కాలేజీలో డ్రోన్ పరిశోధన కేంద్రం ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు నీర్‌జండ్లర్, టెక్నాలజీ ఆఫీసర్ బ్రుస్‌తిన్, బెల్ విశ్రాంత అధికారులు బాత్రా, రాజశేఖర్, కాలేజీ డైరెక్టర్ రవిప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

రామవరప్పాడు: వేసవిని దృష్టిలో ఉంచుకుని గ్రామంలో తాగునీటి సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని నిడమానూరు సర్పంచ్ శీలం రంగారావు అన్నారు. విజయవాడ రూరల్ మండలం నిడమానూరు రామానగర్‌లో గురువారం జలజీవన్ మిషన్ ద్వారా రూ.20లక్షల నిధులతో మంచినీటి పైప్‌లైన్ ఏర్పాటుకై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ 4 వాటర్ ట్యాంకులు, మోటారు బోర్లు, మంచినీటి పైప్‌లైన్ల ద్వారా గ్రామంలో తాగునీటిను సరాఫరా చేస్తున్నామన్నారు. సమస్యాత్మకంగా మారిన వాటర్‌పైప్‌లను ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయిస్తున్నట్లు తెలిపారు. నూతనంగా ఏర్పాటు చేయనున్న ఈ పైప్‌లైన్ ద్వారా గ్రామం మొత్తం తాగునీరు సరఫరా అవుతాయన్నారు. మాజీ సర్పంచ్ పరిమి రమేష్, సచివాలయ కన్వీనర్లు పరిమి సింధూర, పరిమి విష్ణు, బొగ్గవరపు రాజేంద్రప్రసాద్, ఎంపీటీసీ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



పైప్‌లైన్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ శీలం రంగారావు తదితరులు

రక్తదానం చేసిన బాడీ బిల్డర్లు



పెనమలూరు: మండలంలోని కానూరు అశోక్ జిమ్‌కు చెందిన బాడీ బిల్డర్లు గురువారం రక్తదానం చేశారు. సాక్షి దినపత్రిక 15వ వార్షికోత్సవం సందర్భంగా రెడ్‌క్రాస్ సహకారంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో అశోక్ జిమ్‌లో సాధన చేసే బాడీబిల్డర్లు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేశారు. జిల్లా బాడీబిల్డింగ్ అసోసియేషన్ కార్యదర్శి తాళ్లూరి అశోక్ మాట్లాడుతూ.. రక్తదానం చేయటం ద్వారా ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడవచ్చన్నారు. రక్తదానం చేసేందుకు సాక్షి మీడియా అవకాశం కల్పించిందని ఆనందం వ్యక్తం చేశారు.

పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

నున్న(విజయవాడరూరల్): జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు పదవ తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. వచ్చే నెల 3వ తేదీ నుంచి నిర్వహించే కామన్ పరీక్షల్లో నూరు శాతం ఉత్తీర్ణత సాధించాలనే అధికారుల ఆదేశాల ప్రకారం ఉపాధ్యాయులు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. నున్న జిల్లా పరిషత్ హైస్కూల్ లో 77 మంది బాలికలు,74 మంది బాలురు ఈ ఏడాది పదో తరగతి చదువుతున్నారని హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు వజ్రాల భూపాల్ రెడ్డి తెలిపారు. ప్రతి రోజూ ఉదయం 8.30 గంటల నుంచి 9.30 వరకు, సాయంత్రం 4గంటల నుంచి 5 గంటల వరకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామన్నారు. గత ఏడాది పదవ తర గతి కామన్ పరీక్షల్లో మండలస్థాయిలో ఉత్తమ మార్కులు సాధించిన ఘనత నున్న హైస్కూల్‌కు దక్కింది. ఈ ఏడాది కూడా నూరుశాతం ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.



నున్న జిల్లా పరిషత్ హైస్కూల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు

రామమందిరం పునఃప్రతిష్టకు అంకురార్పణ



పెద ఓగిరాల రామమందిరంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

ఉయ్యూరు: మండలంలోని పెద ఓగిరాల గ్రామంలో నూతనంగా అభివృద్ధి చేసిన శ్రీ రామమందిరంలో గురువారం విశేష పూజా కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. గ్రామానికి చెందిన యారం భాస్కర్‌రెడ్డి కుటుంబం, దాతల సహకారంతో రామ మందిరాన్ని పునర్నిర్మించారు. శుక్రవారం నూతన ఆలయంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవం జరగనుంది. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం ప్రత్యేక పూజలకు అంకురార్పణ చేశారు. వేద పండితుల మంత్రోచ్ఛరణతో అభిషేకం, మహాశాంతి హోమం నిర్వహించారు. సర్పంచ్ త్రిపురం లక్ష్మి, గ్రామ పెద్దలు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శుక్రవారం విగ్రహ ప్రతిష్ట, సీతారాముల కల్యాణం, అన్నసంతర్పణ జరుగుతాయని ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపింది.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి

కంకిపాడు: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ హనుమంతరావు సూచించారు. ఉప్పలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని అదనపు డైరెక్టర్ డాక్టర్ అనిల్ కుమార్‌తో కలిసి ఆయన బుధవారం సందర్శించారు. ఆరోగ్య కేంద్రం పరిధిలో నిర్వహిస్తున్న వివిధ సేవలు, ప్రభుత్వం ద్వారా అందిస్తున్న సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వైద్య సేవలపై డాక్టర్ సుందర్‌కుమార్ వివరాలను తెలియజేశారు. ప్రోగ్రామ్ ఆఫీసర్ వెంకట్, వైద్య సిబ్బంది భాస్కర్‌రెడ్డి, పద్మావతి, రాచమళ్ల శ్యాంప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



ఉప్పలూరు పీహెచ్‌సీని సందర్శిస్తున్న డాక్టర్ హనుమంతరావు, డాక్టర్ అనిల్‌కుమార్

భగత్‌సింగ్‌కు ఘన నివాళి



భగత్‌సింగ్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పెనమలూరు: మండలంలోని యనమలకుదురు గ్రామంలో సర్దార్ భగత్‌సింగ్ వర్ధంతిని గురువారం నిర్వహించారు. గ్రామంలో భగత్‌సింగ్ నగర్‌లో భగత్‌సింగ్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. భగత్‌సింగ్ ఆశయాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. విద్యార్థి యువజన సంఘాల అధ్యక్షుడు పి.క్రాంతి, సీఐటీయూ కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి, ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి షేక్ కాశిం, డీవైఎఫ్ఐ నాయకులు షేక్ ఇబ్రహీం, నవజీవన్, రవికుమార్, ఎస్ఎఫ్ఐ నాయకుడు తులసిరామ్ పాల్గొన్నారు.

26న సిరిధాన్యాలపై అవగాహన సదస్సు

ఉంగుటూరు: మండలంలోని ఆత్కూరులో స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఈ నెల 26న రైతునేస్తం ఫౌండేషన్, ట్రస్ట్ సంయుక్తంగా సిరిధాన్యాలతో సంపూర్ణ ఆరోగ్యం అంశంపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ట్రస్ట్ డైరెక్టర్ పరదేశి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ట్రస్ట్ ఆడిటోరియంలో ఆదివారం ఉదయం 10 గంటలకు కృషిరత్న స్వతంత్ర శాస్త్రవేత్త, పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ ఖాదర్‌వలి దేశీ ఆహారంతో ఆధునిక రోగాల నియంత్రణ, నిర్మూలనపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగించుకోవాలని సూచించారు. వివరాలకు 9347956659 ఫోన్ నంబరు సంప్రదించాలని పేర్కొన్నారు.